క్లుప్తంగా

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

కరప: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికీ అనేక పథకాల ద్వారా ప్రయోజనం చేకూర్చారని, ఆయనను ఆశీర్వదించాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ ఆధ్వర్యంలో కరపలో మూడోరోజు ఆదివారం మెరకవీధి, పల్లపువీధి, శివ, విష్ణాలయం వీధులలో స్థానిక నాయకులతో కల్సి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం జగన్ సారథ్యంలో కాకినాడరూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి రూపేణా రూ 102.42 కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

మోక్షగుండంకు నివాళి

కాకినాడ రూరల్: ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు నివాళులర్పించారు.

ముఖద్వారాల వద్ద పటిష్ట నిఘా

కాకినాడ: ఎన్నికల నేపథ్యంలో నగర ముఖద్వారాల వద్ద నిఘాను మరింత పటిష్టవంతం చేసినట్టు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఆదివారం ఆయన స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలతో కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతాప్‌నగర్ వంతెన, కుంభాభిషేకం, ఉప్పలంక వద్ద మూడు చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ చెక్‌పోస్టు వద్ద మూడు షిఫ్టులలో 27 మందిని నియమించామన్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద స్టాటిక్ సర్వేలైన్స్ బృందంలో సిబ్బందితో పాటు ఒక వీడియోగ్రాఫర్, ఇద్దరు పోలీస్ సిబ్బంది కూడా ఉంటారని చెప్పారు.

కుట్టుమెషీన్ అందజేత

బోట్‌క్లబ్: స్థానిక దుమ్ములపేటకు చెందిన పెమ్మాడి మణికి గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ ఆదివారం కుట్టుమెషీన్ అందించారు. వివేకానంద సేవా సమితి సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. బీజేపీ సిటీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐడియల్‌లో ప్లేస్‌మెంట్ డే

బాలాజీచెరువు: ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ప్లేస్‌మెంట్ డే-24 నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ 2020-24 ఏడాదికి సంబంధించి ఈసీఈ, సీఎస్ఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ విభాగాలకు చెందిన 234 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినికుమారి, ప్రెసిడెంట్ ఎస్.ఎస్.మూర్తి, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, పీఆర్ఓ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బ్యాంక్ ఉద్యోగుల వితరణ



పరివర్తన అనాథ ఆశ్రమంలో కెనరా బ్యాంక్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘ సభ్యులు

బాలాజీచెరువు: మానవీయ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి ఆదివారం కెనరా బ్యాంక్ ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం చేయూత నిచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.గణేష్ ఆధ్వర్యంలో ముందుగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరివర్తన అనాథ ఆశ్రమం, మహర్షి సాంబమూర్తి దివ్యాంగ బాలికల పాఠశాల, మానవీయ ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వీటికి అవసరమయ్యే వంట సామాన్లు, నిత్యావసర వస్తువులు అందజేసి అన్నదానం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ కార్యదర్శి బూల సుధీర్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గొర్రిపూడిలో ప్రచారం

కరప: మండలం గొర్రిపూడిలో ఆదివారం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ నాయకులతో కల్సి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పాల్గొన్నారు.

కాండ్రకోట నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చు ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మండలం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి తొలి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



దళిత గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



ఏపీఎన్‌జీవో హోమ్‌లో ఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



జేఎన్‌టీయూకేలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ అధికారి బాలకృష్ణ



రమణయ్యపేటలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ అర్జున్

అన్ని వర్గాలకు ఆరాధ్యుడు అంబేడ్కర్

ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి



ఎల్విన్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, ద్వారంపూడి



నడకుదురులో అంబేడ్కర్ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్



కరపలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఆశాజ్యోతి ప్రభృతులు

కాకినాడ: భారతదేశానికి మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాలకు ఆరాధ్యులని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం కాకినాడలోని పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొడారిగుంట అంబేడ్కర్ సర్కిల్‌లోని కాంస్య విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బల్ల సూరిబాబు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నో పాలనా సంస్కరణలు అమలు చేశారని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక ఇంద్రపాలెం సమీపంలోని ఆయన కాంస్య విగ్రహానికి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలమలశెట్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లెక్కలు ప్రకారమే 2019 నాటికి 11.7 శాతం ఉన్న పేదరికం. జగన్ అధికారంలోకి వచ్చాక 4.2 శాతానికి తగ్గిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా సీఎం జగన్ గొప్ప పరిపాలన చేస్తున్నారన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కృషి జరుగుతోందన్నారు. విజయవాడ నడిబొడ్డున దేశంలోనే ఎక్కడా లేని విధంగా 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని, స్మృతివనాన్ని నిర్మించారన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పశుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల భీమారావు, పలువురు ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్విన్‌పేటలో...

ఎల్విన్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ద్వారంపూడి నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల బీమారావు, ఎస్సీ నాయకులు దీపక్, వరప్రసాద్, డేవిడ్, రామ్‌జీ, పలువురు ఎస్సీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక 45వ డివిజన్ హరిజనపేటలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు.

భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు బంగారు సత్యనారాయణ, రాజ్‌కుమార్, ఎం.రాజు, నరసింహ, వీరబాబు, బుజ్జి పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు.

దళిత గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

దళిత గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్‌లో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వి.సురేష్, ఐక్యవేదిక నాయకులు డోకుబుర్ర భద్రం, కొమ్ముకూరి నాగేశ్వరరవు, గడ్డం రవి, పాలేటి కృపానందం, కొయ్యా నాగిరెడ్డి, సుధాకర్, సిద్ధాంతపు రాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్‌జీవో హోమ్‌లో..

కాకినాడ ఏపీఎన్‌జీవో హోమ్‌లో ఎన్‌జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు గుద్దటి రామమోహన్‌రావు, నాయకులు పేపకాయల వెంకట కృష్ణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ల చంద్రరావు, ఎస్ఎంకేజి ప్రసాద్, సత్తిరాజు, రామకృష్ణ, రమణ, బి.సుజాత పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భారతదేశ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర కీలకం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భారతదేశ నిర్మాణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర కీలకమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. వర్సిటీ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్సిటీలో ఆయన విగ్రహంతో పాటు గ్రంథాలయం ఏర్పాటుచేసి ఆయన ఖ్యాతిని మరింత తెలియజేశామన్నారు. వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యుయేషన్ అధికారి డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ నవ భారత వికాసానికి బాటలు వేసిన గొప్ప మానవతావాది అంబేడ్కర్ అని, సమసత్వానికి విశేషమైన కృషి చేశారన్నారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, లైజాన్ ఆఫీసర్ కుమారస్వామి, వర్సిటీ అధ్యాపకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వాడవాడలా..

కరప: మండలంలో వాడవాడలా భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని ఆదివారం అంబేడ్కర్ యువజన సేవాసంఘాలు, ప్రజలు, నాయకులు నిర్వహించారు. కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, లోహిదాస్‌కుమార్ దంపతులు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, ఎస్ఐ టి.రామకృష్ణ ఎస్సీనాయకులతో కల్సి డాక్టర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రామకంచి రాజునగర్‌లో బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బైలపాటి నూకరాజు, సర్పంచ్ ఆశాజ్యోతి, రాయుడు శ్రీనివాస్‌లు, పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు రొక్కాల గణేష్, దేగల లలితకుమారి, సవిలే నీలిమ, కమిడి మంగాదేవి, చింతా నాగలక్ష్మి, వెలుగుబంటి రాఘవ, వాసంశెట్టి శ్రీనుబాబు, నాగిరెడ్డి ఏసురత్నం, బొమ్మిడి నయోమి, కొత్త నాగలక్ష్మి, అడబాల సత్య, వాసంశెట్టి రామారావు, పలివెల నాగేశ్వరరావు, నున్న సుజాత నివాళులర్పించారు. నడకుదురులో కన్నబాబుయూత్, అంబేడ్కర్‌యూత్ ఆధ్వర్యంలో దాలిపర్తి శ్రీనివాస్ నివాళులర్పించారు. పెద్దాపురప్పాడులో అంబేడ్కర్ యువజన సేవాసంఘం సభ్యులు పీతల చంద్రరావు, గుబ్బల రామస్వామి, పోతురాజు వెంకటరమణ, ముడే చంద్రశేఖర్, బుడితి రామారావు, కాలకురచ రాముడు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీసర్పంచ్ గొల్లపల్లి ప్రసాద ప్రారంభించారు.

అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు గ్రామంలోను, పరిసర గ్రామాల్లో పర్యటించి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: అంబేడ్కర్ జయంతి వేడుకలు కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పండగలా జరిగాయి. అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నియోజకవర్గ పరిధిలో సుడిగాలి పర్యటనలా కాకినాడ రూరల్, అర్బన్, కరప మండలాలలో పలు చోట్ల వేడుకల్లో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. తొలుత క్యాంపు కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న అనంతరం రమణయ్యపేట ఇందిరానగర్‌లో వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి కాకినాడ అర్బన్ పరిధిలోని 47, 48, 50వ డివిజన్లలో, రూరల్ మండలంలోని కొవ్వూరులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. తిమ్మాపురంలో ఎస్సీ పేటలో జరిగిన వేడుకల్లో సర్పంచ్, జేఎన్‌టీయూకే వీసీ మెంబర్ బెజవాడ సత్యనారాయణ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాకినాడ 49వ డివిజన్ కొత్త గైగోలుపాడులో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత జమ్మలమడక నాగమణి, కడియాల చిన్న నివాళులర్పించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.పోచయ్య, సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అన్ని గ్రామాలలో రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలను పండగలా జరుపుకొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో..

రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్లు సాంబయ్య, సత్యనారాయణ, ఆర్ఐలు సురేష్‌బాబు, రాము, రవిశంకర్, రామకృష్ణ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

జెడ్పీలో...

కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్‌లో అంబేడ్కర్ జయంతి సీఈవో శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. డిప్యూటీ సీఈవో జి.రామ్‌గోపాల్, జెడ్పీ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా సీఎం జగన్ పాలన

కరప: సమాజంలో అసమానతలు తొలగించేందుకు పాటుపడిన భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక విప్లవకారుడు, అమహనీయుడు చిరస్మరణీయుడని కాకినాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన కరప మండలం నడకుదురు, పెనుగుదురు, కరప, వేళంగి, వాకాడ గ్రామాల్లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కల్సి పర్యటించి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితోనే రాష్ట్రంలోని పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబును గెలిపించి తద్వారా జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కాకినాడరూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నేటితరం ప్రపంచ మేధావిగా కీర్తి పొందిన అంబేడ్కర్ ఆశయసాధనకు అందరూ కృషిచేయాలన్నారు. భావితరాలలో స్ఫూర్తిని నింపేందుకు సీఎం జగన్ విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. జగన్‌కు పెరుగుతున్న ఆదరణ చూడలేక, ఎన్నికల్లో ఓటమి భయంతోనే తమనేత జగన్‌పై రాళ్లతో దాడి చేయించడాన్ని ఎమ్మెల్యే ఖండించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, కూటమికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని కన్నబాబు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, కరప, నడకుదురు, వేళంగి సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, దేగల లలితకుమారి, సవిలే నీలిమ, వైఎస్సార్ సీపీ నాయకుడు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్, దాలిపర్తి శ్రీనివాస్, మార్రెళ్ల వెంకటరమణ, వజ్రపు కామేష్, మద్దూరి భాస్కర్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ఒక్క ఇల్లు అయినా కట్టారా?

ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి

కాకినాడ: తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు నిరుపేదలకు సెంటు స్థలం కానీ, ఒక్క ఇల్లు కానీ నిర్మించలేకపోయారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. పేదల సంక్షేమం పట్టని టీడీపీకి ప్రజలను ఓటు అడిగే హక్కులేదన్నారు. స్థానిక 12 డివిజన్ సంజయ్‌నగర్, వైఎస్సార్ విగ్రహం నుంచి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గణేష్‌నగర్, హనుమాన్‌నగర్ మీదుగా ప్రచారాన్ని కొనసాగిస్తూ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎన్నికలలో గెలిపించాలని ద్వారంపూడి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక 30 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, 10వేల ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రారంభించామని ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి వెంట స్థానిక నాయకులు మట్టపర్తి రఘురాం, జితేంద్ర సింగ్, బొద్దిరెడ్ల పుష్ప పరశురాం, కోనాడ దుర్గాప్రసాద్, మాదిరెడ్డి పద్మ ఉన్నారు.

ద్వారంపూడిని ఆశీర్వదించండి: మహాలక్ష్మి

గడచిన ఐదేళ్లలో తన భర్త ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఆయన భార్య ద్వారంపూడి మహాలక్ష్మి ఓటర్లను కోరారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి ఆదివారం 41వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. నిరంతరం ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి ఆధ్వర్యంలో పెనుమూరివారివీధి, కమలాదేవి వీధి, చావలివారివీధి, రైతుబజార్ సెంటర్ ప్రాంతాల్లో ఆమె ఇంటింటికి వెళ్లి చేసిన అభివృద్ధిని చూసి భర్త ద్వారంపూడిని మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



భర్త చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ద్వారంపూడి మహాలక్ష్మి

భారీ మెజార్టీతో గెలిపించండి

కాకినాడ రూరల్: రాష్ట్రంలో మళ్లీ జగనన్న సంక్షేమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఆశీస్సులు తమకు ఇవ్వాలని, భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామంలో ఇద్దరూ కలిసి ఆదివారం పర్యటించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో వలసపాకల జంక్షన్ వద్ద భారీ గజమాలతో తొలుత స్వాగతం పలికారు. ప్రచారం వాహనంపై సునీల్, కన్నబాబు ప్రజలకు అభివాదం చేస్తూ గ్రామంలో ప్రధాన వీధులు, రహదారుల్లో పర్యటించారు. గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. యువకులు ఉత్సాహంగా బైక్ ర్యాలీలో పాల్గొనగా, తీన్‌మార్ డప్పులు, వైఎస్సార్ సీపీ జెండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ ఎంపీగా కాకినాడ జిల్లాలో యువతకు ఉద్యోగాలుతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మళ్ళీ సీఎంగా జగన్‌ను చేసుకోవల్సి ఉందన్నారు.

జనసేన నుంచి 50మంది చేరిక

జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ నివాసం వద్ద వాకలపూడి, కాకినాడ 2వ డివిజన్ కొండేలుపేట చెందిన మత్స్యకారులు సుమారు 50మంది జనసేన, టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చుక్కా శ్రీను, గొల్లపల్లి కాశీ, నల్లా శ్రీను ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ అభ్యర్థి సునీల్ సమక్షంలో చేరారు. పార్టీ కండువాలు వేసిన కన్నబాబు, సునీల్ వైఎస్సార్ సీపీలోకి స్వాగతించారు. పార్టీ విజయం కోసం పనిచేయాలని కోరారు.

బృహతి హోమం సర్వ శ్రేయోదాయకం

బోట్‌క్లబ్: స్థానిక మధ్వ సభ ప్రాంగణంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అతి పవిత్రమైన బృహతి సహస్ర యాగం విజయవంతంగా ముగిసింది. ఉత్తరాది మఠ ప్రత్యేక అధికారి సుధా పండితులు కాను గోవి వాసుదేవా చార్ స్వీయ పర్యవేక్షణలో యాగం ముగింపు సందర్భంగా ఆదివారం హోమం నిర్వహించారు. ఎంతో పవిత్రమైన విశిష్టత కలిగిన బృహతి యాగం నిర్వహించడం ద్వారా అనేక ప్రయోజనాలను మనం పొందగలమని రాజమండ్రి ఉత్తరాది మఠ అధికారి సుధా పండితులు విజయ సింహాచార్ అన్నారు. బృహతి హోమాన్ని నిర్వహించడం ద్వారా భగవంతుని కృపతో పాటు ఆయు ఆరోగ్యాన్ని పొందగలమన్నారు. ఎంతో కష్టమైన ఈ హోమ నిర్వహణ కార్యక్రమాన్ని అంకితభావంతో నిర్వహించేందుకు కాకినాడ మధ్వ సభ కమిటీ ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. పండిత కాను గోవి వాసుదేవాచార్ మాట్లాడుతూ సహస్ర యాగ కార్యక్రమానికి రెండు దశాబ్దాల క్రితమే సత్యాత్మ తీర్థ స్వామీజీ అనుగ్రహంతో పారాయణ ద్వారా శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఆదివారం ఉదయం 5 గంటల సహస్రనామ హోమ కార్యక్రమం ప్రారంభించి సుమారు ఏడు గంటల పాటు జరిపిస్తూ సహస్రనామ మంత్రాలతో పాటు రుత్వికులు జరిపించిన హోమ ప్రక్రియ విశేషమైన భక్తి భావాన్ని పెంచిందన్నారు. కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి కార్యదర్శి కోపెల్ల శేష గిరిరావు, ఉపాధ్యక్షుడు తాడూరి రంగారావు, కోశాధికారి వేముగంటి రాము, సంయుక్త కార్యదర్శి డాక్టర్ యాత గిరి పరశు రామ్ పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

ఓటింగ్ శాతం పెంచేలా కృషి

ఆర్వో వెంకటరావు పిలుపు

కాకినాడ: రానున్న ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వివిధ సేవా సంస్థలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో పలు సేవా సంస్థలు, రోటరీ, లయన్స్, కాలనీ సంఘాల ప్రతినిధులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా వర్గాల ఓటర్లకు కల్పించిన సదుపాయాలను ఆయన వివరించారు. ముఖ్యంగా ఓటు వేసేందుకు వచ్చే వృద్ధుల కోసం ప్రతి పోలింగ్ సెక్టార్‌కు ప్రభుత్వ పరంగానే రెండు ఆటోలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు కూడా ఉంటాయన్నారు. ఓటింగ్‌కు సంబంధించిన సమగ్ర సమాచారం కోసం వోటర్ హెల్ప్‌లైన్ యాప్ అందుబాటులో ఉందని, నోటా, చాలెంజ్ వోట్ కూడా అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఓటింగ్‌కు హాజరవ్వాలని సూచించారు. వివిధ వర్గాల ప్రతినిధులు మాట్లాడుతూ ఓటు పై ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు కాలనీ అసోసియేషన్‌లతో సమావేశాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక వసతులు, కొత్త ఓటర్లకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి వెంకటరావు స్పందిస్తూ ప్రభుత్వపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సిస్టమేటిక్ వోటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ నోడల్ అధికారులు భానుప్రకాష్, విజయ్ భాస్కర్, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, రోటరీ ప్రతినిధి రవికృష్ణ, నూకరాజు పాల్గొన్నారు.



సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరావు

అన్నదానం

బోట్‌క్లబ్: గుజ్జువారి వీధిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ చైర్మన్ దువ్వి ఆదిరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. అర్చకులు ఉపాధ్యాయుల విజయకుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు పాల్గొన్నారు.